క్లుప్తంగా

సీఎంకు వినతి



సీఎంకు పూలమొక్కను అందజేస్తున్న టీఎస్‌పీటీఏ నాయకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం నివాసంలో కలిసి రూ.10 వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని, డిప్లమో కోర్సు మాత్రమే అర్హత కలిగిన భాషా పండితుల రివర్షన్ చేసి ఉమ్మడి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలు పాత విధానంలో కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలీల్, మంగ, పార్థసారథి, మహ్మద్ జమాల్, భాష్యం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



షకీనాను సన్మానిస్తున్న బుడబుక్కల సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ, ఏపీ ఉమ్మడి రాష్ట్రాల బుడబుక్కల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన గెట్‌టు గెదర్ కార్యక్రమంలో తెలంగాణ ఎంబీసీ రాష్ట్ర కో కన్వీనర్, మైనార్టీ నాయకురాలు షేక్ షకీనాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సురేష్, ఎస్‌వీ.రావ్, సిద్ధప్ప, పాపన్న, గోవిందరావు , నరసింహ, రామచంద్రం, దారున్న వెంకన్న, బాలరాజు, సుధాకర్, బి.సురేష్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న రామారావు

నేలకొండపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జై గౌడ్ ఉద్యమ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ కాసాని సతీష్‌ను జై గౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు వట్టికూటి రామారావు మండలకేంద్రంలోని సతీష్ నివాసంకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బోదులబండ సొసైటీ చైర్మన్ అనంతు కాశయ్య, గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు తాతా హనుమంతరావు, పాలేరు కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు జెర్రిపోతుల సత్యనారాయణ, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావు, నాయకులు నాగార్జున, గుండు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	హరోం హర
సాయిరాం	ఓఎంజీ (ఓ మంచి గోస్ట్)
	సీతాకల్యాణ వైభోగమే
ఆదిత్య	నింద
శ్రీనివాస	మహారాజ

\- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	70	బచ్చలికూర	2
వంకాయ	40		10
బెండకాయ	34	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	64	చుక్కకూర	3
బీర	54		20
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	60		10
గోరుచిక్కుడు	68	గోంగూర	2
దోసకాయ	40		10
క్యాబేజీ	40	మెంతికూర	2
ఆలుగడ్డ	38		20
చామగడ్డ	48	కొత్తిమీర	1
క్యారెట్	50		50
క్యాప్సికం	90	పుదీన	1
బీట్‌రూట్	38		30

\-ఖమ్మం వ్యవసాయం

కళాశాల ఏర్పాటయ్యేనా?

నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక తిప్పలు

- కూసుమంచిలో ఏర్పాటుకు మంత్రి పొంగులేటి ఆదేశాలు
- స్పష్టత లేకపోవడంతో గందరగోళం
- ఎదురుచూపుల్లో విద్యార్థులు



కూసుమంచిలో కళాశాలకు ప్రతిపాదించిన హైస్కూల్ పాత భవనాల స్థలం

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకోసం విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ కొన్నేళ్లుగా వస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూసుమంచిలో కళాశాలను ఏర్పాటు చేయాలంటూ స్థానిక యువత, విద్యావంతులు పోటీ చేసిన అభ్యర్థులను కోరారు. మూడు నెలల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి కళాశాల ఏర్పాటు అంశాన్ని పలువురు తీసుకరాగా ఆయన కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సుమంచిలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు అభ్యంతరం లేదంటూ అధికారులు ఏప్రిల్‌లో ఎన్‌ఓసీ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో కళాశాల ఏర్పాటుపై ఆశలు చిగురించాయి.

176 మంది విద్యార్థులకు అనుమతి..

కాగా కూసుమంచిలో కొత్తగా ఏర్పాటు చేసే జూనియర్ కళాశాలలో 176 మంది విద్యార్థులు చదివేందుకు అనుమతినిస్తున్నట్లు ప్రొసీడింగ్ లేఖలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 88 మంది, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో మరో 88 మంది విద్యార్థులకు సీట్లు కల్పిస్తున్నట్లు తెలిపారు.

కళాశాల లేక ఇక్కట్లు..

కూసుమంచి మండలం పూర్తిగా గ్రామీణం కాగా ఇక్కడ ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నారు. వారంతా పది పూర్తయితే కూసుమంచిలోని ప్రైవేటు కళాశాలకు గానీ, ఖమ్మం కానీ వెళ్లాల్సి వస్తుంది. దీంతో పాటు సమీప సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల విద్యార్థులు కూడా ఇంటర్ విద్యకు కూసుమంచి, ఖమ్మం వస్తున్నారు. కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని, కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, స్థానిక యువత విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. కళాశాలను ఏర్పాటు చేస్తే వందలాది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని, ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నత పాఠశాల స్థలంలో..

ఈ కళాశాలను కూసుమంచిలోని ఉన్నత పాఠశాల పాత భవనాల స్థలంలో నిర్మించాలని, భవనాల నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాల నూతన భవనాల్లో తరగతులు నిర్వహించాలని అధికారులు సూచనప్రాయంగా నిర్ణయించారు. ఇందుకోసం తగు చర్యలు తీసుకోవాలంటూ మండల విద్యాశాఖ అధికారులను కూడా కోరారు. కాగా ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం అయినా ఈ కళాశాల ఏర్పాటుపై ఎలాంటి స్పష్టత లేకుండాపోవడంతో గందరగోళం ఏర్పడింది.

అనుమతి రావాల్సి ఉంది...

కూసుమంచిలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించటం జరిగింది. ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే కళాశాల తరగతులను ప్రారంభిస్తాం. కళాశాల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

\- రవిబాబు, డీఐఈఓ

కళాశాలను ప్రారంభించాలి...

కూసుమంచిలో జూనియర్ కళాశాల లేక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులు నష్టపోవల్సి వస్తుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే కళాశాలను ప్రారంభించి విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలి

\- గుండా ఉపేందర్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు

ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి

- ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

సాక్షి ఎఫెక్ట్..



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్‌పై 'హై స్పీడ్‌తో హైరానా' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి ఈ మేరకు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు ముఖ్యకారణం మద్యంమత్తులో వాహనాలు నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్ అన్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి ట్రాఫిక్ పోలీసులు ప్రతీరోజు నగరంలో వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు ఇక ముందుకూడా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి 225 మైనర్ డ్రైవింగ్ కేసులు, 4,094 ర్యాష్, స్పీడ్ డ్రైవింగ్, 881 రాంగ్ సైడ్ డ్రైవింగ్, 93 త్రిబుల్ రైడింగ్, 1,087 నంబర్ ప్లేట్ లేని వాహనాలపై కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇక నుంచి డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్ చేసి వారితోపాటు వారి తల్లిదండ్రులను న్యాయస్థానంలో హాజరుపరచడం జరుగుతుందన్నారు.

పాఠశాలల బాధ్యత ఉపాధ్యాయులదే..



మాట్లాడుతున్న మనోహర్‌రాజు

ఖమ్మంరూరల్: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని టీపీటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు అన్నారు. ఆదివారం మల్లెమడుగు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వీరభద్రరావు పదవీ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని రకాల సైకర్యాలు కల్పిస్తున్నపటికీ విద్యార్థుల సంఖ్య నానాటికీ పడిపోవడం బాధాకరమని తెలిపారు. డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడుతూ... వీరభద్రం సేవలు ప్రశంసనీయమని, ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు రవికుమార్, సీఎంఓ రాజశేఖర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వై. వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, వీరాస్వామి, వరప్రసాద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది రైతు పక్షపాత ప్రభుత్వం



ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కామేపల్లిలో..

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్‌ది రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతుల కళ్లలో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.2 లక్షల రుణమాఫీకి క్యాబినెట్ ఆమోదం తెలపడంపై ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకకాలంలో రూ.రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావేద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, జిల్లా నాయకులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, యడ్లపల్లి సంతోష్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, రబ్బాని, శెట్టి రంగారావు, గజ్జెల్లి వెంకన్న, బొమ్మిడి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు.

కామేపల్లి: తెలంగాణ రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. నాయకులు దమ్మలపాటి సత్యనారాయణ, రెడబోతు గోపిరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, ధనియాకుల హన్మంతరావు, గబ్రూనాయక్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ఆరెం రవి, అనురాధ, సరిరాంనాయక్, సైదులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: ఏఐఎస్ఎఫ్ తెలంగాం రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25, 26, 27 తేదీల్లో కరీంనగర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తూ విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చి విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేసిందన్నారు. సంఘ రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, చందులాల్, నాయకులు రాకేష్, ప్రతాప్, రోహిత్, బాలాజీ, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి

- ప్రమాదానికి గురైన వ్యక్తిని కాన్వాయ్‌లో ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రుడిని వాహనంలోకి ఎక్కిస్తున్న మంత్రి

కూసుమంచి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఎంజీనగర్ తండాకు చెందిన రత్నావత్ అశోక్ గ్రామానికి వెళ్లే క్రమంలో సూర్యాపేట–ఖమ్మం రహదారి దాటుతుండగా, ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆ ప్రమాదాన్ని గమనించి తన కాన్వాయ్‌ని ఆపారు. అశోక్‌ను తన కాన్వాయ్‌లోనే ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా మంత్రికి బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ప్రథమస్థానం సాధించిన మంగాపురం జట్టు

నేలకొండపల్లి: ఖమ్మం సబ్ డివిజన్ స్థాయిలో నాచేపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మంగాపురం తండా జట్టు విజయం సాధించింది. మండలంలోని నాచేపల్లిలో గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి ప్రారంభమైన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి మంగాపురంతండా, ద్వితీయ బహుమతి నాచేపల్లి జట్టు, తృతీయ బహుమతి కమలాపురం జట్టు, నాల్గొవ బహుమతిని నాచేపల్లి జట్టులు కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాచేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య మాట్లాడారు... యువకులు గ్రామీణ స్థాయి నుంచి ఎదగాలని, సామాజిక సేవతో పాటు, క్రీడలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మక్తాల రామకృష్ణ, మాజీ సర్పంచ్ మందడి రాజేష్, ముంద్ర నాగప్రసాద్, అమ్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు, కాలపొంగు బాబురావు, క్లోం శ్రీనివాసరావు, గారపాటి లక్ష్మీనారాయణ, రాయల రాజేందర్, రేగళ్ల రవి, యాతాకుల శ్రీనాథ్, నిర్వాహకులు గట్టిగుండ్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



విశ్వనాథచారీలు (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో రిటైర్డ్ హెచ్‌ఎం ఇటికాల విశ్వనాథ చారీలు అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సుదీర్ఘ కాలంగా గ్రామంలో పని చేసిన చారీలు ఊరుతో ఉన్న తన అనుబంధంకు గుర్తుగా తన పేరు మీద ఒక పక్కా భవనంతో గ్రంథాలయం నిర్మించి గత కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారు. ఈ మేరకు పలువురు ఆయన మృతికి నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారానికి సమావేశం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న వరంగల్ వడ్డెపల్లిలోని 327 యూనియన్ కంపెనీ కార్యాలయంలో సమావేశం ఉంటుందని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, వి.సీతారాం గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని, తదితర సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశామని, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి



ఖమ్మంమామిళ్లగూడెం:మాట్లాడుతున్న అంజయ్య



తిరుమలాయపాలెం:మాట్లాడుతున్న ఆనందరావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి మూడు దశాబ్దాలయిన సందర్భంగా ఈ నెల 27న ఎమ్మార్పీఎస్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సన్నాహక కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోరారు. అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఖమ్మం నియోజనవర్గ ఇన్‌చార్జ్ తూరుగంటి అంజయ్య మాట్లాడారు. నాయకులు రాము, సైదులు, జనార్దన్, నాగేశ్వరరావు, మోహన్, రాములు, వీరన్న, యేసు, నాగరాజు, శ్రీను, వెంకటరత్నం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: వరంగల్ జిల్లా కేంద్రంలో జూలై 7న నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతు ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో పాలేరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జూన్ 30న నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రాల్లో ర్యాలీలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు బచ్చలకూరి వెంకటేశ్వర్లు, పైడికత్తుల ఈదయ్య, చింతిరాల నాగభూషణం, కనకం జనార్దన్, తోళ్ల వెంకన్న, సురేష్, పగిడిపల్లి బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముఖర్జీ కృషి ఫలితమే ఆర్టికల్ 370 రద్దు



ఖమ్మం మామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న సత్యనారాయణ, నాయకులు



నేలకొండపల్లి: కొత్తకొత్తూరులో..

ఖమ్మం మామిళ్లగూడెం: 370 ఆర్టికల్ రద్దు శ్యాంప్రసాద్ ముఖర్జి బలిదాన ఫలితమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కమర్లపుడి ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంరాథోడ్, అల్లిక అంజయ్య, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రేఖా సత్యనారాయణ యాదవ్, సుధాకర్, చావా కిరణ్, వీరుగౌడ్, నరసింహరావు, నెల్లూరి కోటేశ్వరరావు, నీలిమ, సైదులు, నాగమణి, వెంకట్, శ్యామ్, శ్రీనివాసరెడ్డి, మధు, గజల శ్రీనివాస్, మృత్యుంజయరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరవలేనివని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ అన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండలాధ్యక్షుడు పిట్టల సూరిబాబు, యువ మోర్చా అధ్యక్షుడు తొగాటి నాగచారీ, కందరబోయిన గోపి, దేశబోయిన వేణుబాబు, గుగులోత్ నాగేశ్వరరావు, వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా జలమయం..!

- డ్రైయినేజీ లేక రోడ్డుపైనే నిలుస్తున్న వర్షం, మురుగు నీరు



సీసీ రోడ్డు పైనే నిలిచిన వర్షపు నీరు

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి పంచాయతీలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సీసీ రోడ్లు వేసినప్పటికీ రోడ్ల నిర్మాణంలో ఇంజనీర్లు నిర్లక్ష్యంకు తోడు డ్రైయినేజీలు లేకపోవడంతో వాన, మురుగు నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సీసీ రోడ్లు నిర్మాణం చేశారు. అంతకుముందే ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి నిర్మించి సీసీ రోడ్డుకు అనుబంధంగా కొత్తగా రోడ్లు నిర్మించారు. దానికి అనుసంధానంగా నీరు నిల్వ ఉండకుండా రోడ్డు వేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పాత రోడ్డు ఎత్తు తక్కువ, కొత్తగా వేసిన రోడ్డు ఎత్తుగా వేయడంతో రెండు రోడ్ల మధ్య నీరు నిలుస్తోంది. దీనికి తోడు పాపటపల్లి ప్రధాన రోడ్డును విస్తరించి సీసీ రోడ్డు నిర్మించి డ్రైయినేజీలు నిర్మించకపోకపోవడంతో నీరు మొత్తం రోడ్లపై పారడంతోపాటు, నిలిచి అధ్వానంగా మారాయి. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం సముదాయం, పాఠశాలకు వెళ్లే సీసీ రోడ్లుపై నీరు నిలిచి నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని నివాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చిన తర్వాత ఒకటి రెండు రోజులు నీరు అలానే నిల్వ ఉండటంతో ఇబ్బందిగా ఉందని ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోని నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు, డ్రైయినేజీలు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డుతోపాటు ఇరుపక్కల ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. డ్రైయినేజీలు వెంటనే నిర్మించాలని, వ్యాధులు, వానాకాలం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తగు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.